# యాచన

ఉదయంనుంచీ ఒకటే పనిగా కురుస్తూవున్న వర్షం సాయంత్రం నాలుగు గంటలకల్లా కొంచెం తెరిపియిచ్చింది. వర్షం విలిసిందేతడవుగా మిత్రులమంతా యేదో మునిగిపోయినట్లు కబుర్లు చెప్పుకోవచ్చుననే ఉద్దేశ్యంతో ఒక్కరొక్కరమే మారాముడిఇంట్లో పోగైనాము.

జోరుగా బాతాఖానీ జరుగుతూవుంది. ఒకడు "ఔనన్న" విషయాన్ని ఇంకొకడు "కాదంటూ" నానా గందరగోళంగా, ఇంటికప్పసహితం మా అల్లరికి అమాంతంగా ఎగిరిపోతుందేమో నన్నట్లు వాగ్వాదాల్లోకి దిగాము.

గది గుమ్మం వెలుపల యేదో అపరిచితమైన పదధ్వని వినపడింది.

మా జట్టులో ఒక్క భాస్కరరావు తప్ప తక్కినవాళ్ళమంతా గదిలోనే వున్నాము. భాస్కరరావు పదధ్వని మిత్రబృందానికంతా చిరపరిచయమే. మనిషీ కొంచం స్థూలకాయుడు. అందువల్ల అతనికి నెమ్మదిగా చప్పుడు లేకండా నడవడమంటే ఈ జన్మలో కాదుగదా మళ్ళీ జన్మలో కూడా తెలియదని మా దృఢనమ్మకం. అసలు మనిషి ఎంతో ఆయాసం మీద కాని నడువాలేడు. అతని పదాఘాతానికి భూమంతా అదిరి గిజగిజలాడుతుంది. ఆతను నడుస్తూవుంటే "ధన్" "ధన్" మన్న ఒక విధమైనశబ్దం కర్ణకఠోరంగా వినపడుతుంది. మేమంతా ఒక్క నిమిషం అదేపనిగా పరిక్షించి వినేవరకల్లా ఆ వచ్చే మనిషి భాస్కరరావు కాడని తేలిపోయింది.

తృటికాలం తరువాత ఒక అమ్మాయి, నీలి చీరకట్టుకొని, ఒయ్యారమొలికిస్తూ మేము కూర్చున్న గదిలోకి వచ్చింది. ఆమె అ నిర్భయాన్ని చూచి మేమంతా స్తబ్ధులమై పోయినాము. మనిషి అనాకారా-కాదు కొంచం నల్లగావున్నా ఒక విధమైనకాంతి ఆమె మొహంలో మెరిసి పోతు

న్నది. నిండుయవ్వనంతో తొణికిసలాడుతున్న ఈ వ్యక్తి మాదగ్గరికి ఎందుకువచ్చిందా అని ఆలోచిస్తూ వుండగానే - మాముందరే - మేమంతా మొగాళ్ళం ఆ గదిలోనే వున్నామని కించిత్తు అయినా లెక్కచెయకండా ఒక కాగితాన్ని, కొంచంగా పమిటతొలగించి, రొమ్ముల్లోంచి బయిటికి తీసి మా సంశయాన్ని నివారించింది.

ఏదో టైపుచేసిన కాగితం మాకళ్ళల్లో పడగానే ఆ అమ్మాయి యాచనకోసం వొచ్చి వుంటుందని తెలుసుకొని మేమందరం మళ్ళీ మామూలు మనుషులమైనాం.

ఆ అమ్మాయి మా అందరిలోకి ఎవరు తెలివికలవాళ్ళో నిశ్చయించుకునేందుకా అన్నట్లు, ఒక్కమాటు గదినాలుగుమూలలుకలయజూచింది. చివరకి మా అందరిలోకి ఒక్కరాడుడే ఉద్దండుడైనట్లూ, అతనిముందు మేమంతా ఒట్టి వాజమ్మలమైనట్లూ చిరునవ్వుతున్న కళ్ళతో తేల్చేసి ఆతనికి ఆ కాగితం అందించింది.

నిజం చెప్పొద్దూ-పై సంగతిచూచి మాఅందరికీ వళ్ళుమండింది. అయినా అప్పట్లో చేసేదేమీలేక-ఒక విధమైన చెప్పరాని ఈర్ష్యతో దహించుకుపోతూ-మౌనం వహించాం. "ఫరవాలేదు...సరుకు బాగానేవుంది." అన్నాడు రాము.

"అప్పుడే నోట్లో నీళ్ళు వూరుతున్నాయా" అన్నాడు విశు వొళ్ళుమండి.

ఇంతలోనే రాముడు ఆకాగితాన్ని తనలోతాను ఒకమాటు చదువుకుని, సంగతి సందర్భాలన్నీ మా కందరికీ తెలిసినిట్లుగానే భావించి అనవసర ప్రసంగంలోకి దిగాడు అతడు ఆ అమ్మాయితో—

"ప్రస్తుతం మీ రెక్కడున్నారు?"

అవకాశం యిచ్చిందే తడవుగా, ఎన్నడో కంఠస్థంచేసిన ఆ నాలుగు వాక్యాలూ దుక్కతిప్పకండా ఆ అమ్మాయి ఏకరువు పెట్టింది.

"మొన్నటి క్వేట్టా" భూకంపంతో మాయిల్లు కూలిపోయింది. మా అన్నయ్యా, మా నాన్నా యిద్దరూ చనిపోయినారు. మొదట్లో ఏదో ఇంత కలిగినవాళ్ళమైనా ఈనాటికి మాగతి ఇట్లాపట్టింది. మా అమ్మ మావదినతోసహా మేము అయిదుగురం-గూడులేని పక్షులకుమల్లే "అన్నమో రామచంద్రా" అని బయల్దేరాము—మీపుణ్యముంటుంది. మీరేమన్నా సహాయంచేస్తే......" "Heroins కి పోర్షన్ బాగానే వొచ్చిందిరా" అన్నాడు విశుకొంచం ఆశ్చర్యాన్ని నటిస్తూ—

విశుని యేడ్పించడమంటే రామనాథానికి చాలా ఆసక్తి. అప్రయత్నంగా చిక్కిన అవకాశాన్ని వదులుకోవటం ఇష్టంలేక "అయితే ఇంకేం, నాటకమాడించు" అన్నాడు రామనాథం కొంచం వుడుకుమోతుగా—

ఆమాటకి ఆ అమ్మాయి కొంచంగా సిగ్గు నభినయిస్తూ కొంటెగా చిరునవ్వింది.

హైదరాబాదలో ఇటువంటి యాచకులు చాలామంది—మామూలుగా హైదరాబాదప్రజలు అప్పుడప్పుడు సహజంగా వినే "ఆర్తనాదాలే" మేముకూడా ఆరోజు వినాల్సి వచ్చింది. అందుకోసం ఆ అమ్మాయి మాటలు మమ్మల్ని ససేమిరా కదలించలేక పోయినాయి.

ఆ యాచకురాలిని వదిలించుకుందామనే ఉద్దేశ్యంతో "మేమంతా విద్యార్థులం—అసలు మాదెగ్గరేముంటుంని నీకు యివ్వడానికి" అన్నాను. "ఇంతమంది వుండికూడా ఒక్కరూ ఏమీ సహాయం చేయలేరూ?" అని రెట్టించింది, ఆ అమ్మాయి మళ్ళీ చిరునవ్వుతూ—

ఆచిరునవ్వూ, ఆమనిషివాలకం అదీ కనిపెట్టి "ఒక్కరేమిటిఖర్మం-అందరంకూడ నీకు సహాయం చేయడానికి సిద్ధంగా వున్నా" మన్నాడు విశు.

ఆ మాటకి "అసలు సహాయంచేసే సమయం ఇది కాదే" అన్నాడు రాముడు కొంత సాహసంగా—

అతని ధైర్యానికి మేమంతా చకితులమైనాం. మనిషి ధోరణి చూస్తే శృతిమించి రాగంలోకి దిగేట్టు కనపడ్డాడు ఆతను.

రాముడి వాక్యానికి సరి అయిన జవాబు చెప్పకుండానే ఆ అమ్మాయి—

"ఒక్కడవే ఆమంచంమీద అట్లా పడుకున్నావేమయ్యా, ఆ ధోతి అంతా అట్లా పైకి పోతూనూ" అంది మెరుస్తూవున్న కళ్ళలో నావేపు అదోవిధంగా చూచి—

పై వాక్యానికి నాకు ఒక్కమ్మడిగా వళ్ళు మండుకొచ్చింది. ఘాటైన జవాబు చెబుదామనే వుద్దేశ్యంతో, వెల్లకిల పడుకున్నవాణ్ణల్లా పక్కకి కుడిచేతిమీదుగా తిరిగి ఏదో మాట్లాడడానికి ప్రయత్నించాను— కాని ససేమిరా మాటపెకల్లేదు—ఈ సంగతికనిపెట్టి చప్పున మారాముడు నా సహాయానికి వచ్చి నన్ను అపాయంలోంచి రక్షించాడు.

"పాపం. ఒంటరిగా పడుకున్నాడని జాలేస్తూవుందా? అయితే లోడుకు నీవు వెళ్ళు—మేమంతా బయిటికి వెళ్ళిపోతాం..."

వాక్యం పూర్తికాకముందే మిత్రబృందమంతా గొల్లుమంది. నలుగురితోపాటు ఆ అమ్మాయికూడా వేళాకోళంగా గొల్లున నవ్వింది. నాకు పై ప్రాణాలు పైనే లేచిపోయినాయి.

కొంచం తెప్పరిల్లి మారాముడు మళ్ళీ అందుకున్నాడు—

"యేఁరా, డబ్బేమైనా వుందా? లేకపోతే ఆ డ్రాయిర్‌లో ఒహ రూపాయి వుంది, అంత అవసరమైతే ఆ రూపాయి ఖర్చుపెట్టేసేసుకో, మళ్ళీ నేనేమీ అడగనులే."

పైవాక్యానికికూడా ఆ అమ్మాయి కించిత్తయినా చలించలేదు. రాముడు అందరినీ సద్దుకోమన్నట్టు మిత్రబృందానికంతా కనుసైగ

చేశాడు. "సిగరెట్లు"కని ఒకడు, అగ్గిపెట్టెకని ఇంకొకడూ, అప్పటి కప్పుడే తోచిన మిషలేవో కల్పించుకుని ఒక్కరొక్కరే ఆ గదిలోంచి జారుకోవటం మొదలెట్టారు.

చీటికీ మాటికీ ఒక్కరొక్కరే అల్లా జారుకోవడం చూచి ఆ అమ్మాయి కంగారు పడటం మొదలెట్టింది. చిరునవ్వుతోవున్న మొహమల్లా అఘాటుపాటున కళావిహీనమై పోయింది. చెక్కిళ్ళు కొంచం ఎర్రబారినవి. గదిలో రాముడూ, నేనూ ఆ అమ్మాయితప్ప ఇంకెవరూ మిగలలేదు.

ఆ అమ్మాయి ముఖ కవళిక చూచి, ఏదో నెపంమీద గదిలోంచి వెళ్ళిపోతున్న రాముడుకూడా చప్పున ఆగిపోయినాడు.

ఆ అమ్మాయి అవస్థ చూచి నాకు అమితమైన జాలేసింది. ఆ సందిగ్ధావస్థలోంచి ఆమెను తప్పించడానికి

"యేమిటిరా ఈ వేళాకోళమంతానూ" అన్నాను.

నామాటవల్ల ఆ అమ్మాయి కొంచం ధైర్యం తెచ్చుకుంది—

"మీకు నాలాటి అప్పచెల్లెండ్రు ఎవరూ లేరూ? మళ్ళీ చూస్తే చదువుకున్న వాళ్ళే......"

అంటూ వాక్యం పూర్తిచేయకండానే, కళ్ళల్లో నీళ్ళు నింపుకుని గిరుక్కున మళ్ళింది.

నాకు ఎవరో పెళ్ళున చెంపమీద కొట్టినట్లనిపించింది. డ్రాయర్‌లోంచి రూపాయి తీసుకొని చప్పున వెంటపరుగెత్తాను. రూపాయి అందుకొని, ఆ అమ్మాయి, దాన్ని నా మొహంమీద విసిరికొట్టింది.

నా నొసలు బురబురపొంగింది. కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి ఎందుకో "సహవాసదోషం" అన్న మాటలు నా చెవుల్లో గింగురు మన్నాయి.